కార్తికమాస వైభవం

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

ఎమెస్కో

కార్తికమాస వైభవం

కాలమాహాత్మ్యం

కార్తిక మాసం

'కాలోహి బలవాన్ కర్తా సతతం సుఖదుఃఖయోః
నరాణాం పరతంత్రాణాం పుణ్యపాపానుయోగతః' (దేవీ భాగవతం)

కాలం అనంతం. నిరంతర ప్రవాహం మహాబలవత్తరం సనాతన ధర్మంలో కాలమే సమస్తమైనదిగా నిలబడుతుంది. అందుకే భగవద్గీతలో గీతాచార్యుడు **'కాలాత్ కలయికాం అహమ్'** అంటాడు. నేను భావస్వరూపంలో వుండి లెక్కలు కట్టుకుంటూ వుంటాను అంటాడు.

భగవంతుడి లెక్కలు

ఇవ్వాళ జీవుడు ఈ శరీరంలో వున్నాడు. గతంలో ఇదే జీవుడు ఏ శరీరంలో వున్నాడో తెలియదు. ఏదో శరీరంలో వుండి ఏదో తప్పిదం చేసాడు, ఏదో పాపం చేసాడు, పుణ్యం చేసాడు. ఆ పాపమైనా, పుణ్యమైనా అనుభవించే పోవాలి. పాపము అనుభవ స్వరూపంగా పోవటానికి దుఃఖము; అలాగే పుణ్యము అనుభవంగా పోవటానికి సుఖము, రెండింటికి లెక్క ఇవ్వాలి. వీడు గతంలో చేసిన పాపమెంత, పుణ్యమెంత? ఎంత సుఖపెట్టవచ్చు? ఎంత దుఃఖపెట్టవచ్చు? ఇది లెక్క కట్టగలిగినవాడే లెక్కచెప్పి నీ ఎదుట నిలబడి నీ పాపపుణ్యముల ఫలితమును నీకివ్వడు. ఆయన వెనక నిలబడి గమ్మత్తుగా లెక్కకట్టి, ఆ లెక్క సారాంశంగా సుఖదుఃఖములనిస్తాడు. ఆ పరమేశ్వరుని మనం పట్టుకొని నిలదీయడానికి ఆయన మన కన్నుల ఎదుట కనబడే వాడు కాదు. మాంస నేత్రములకు గోచరము కాదు. కాబట్టి ఈశ్వరుణ్ణి నిలబెట్టి ప్రశ్న చేయడం సాధ్యంకాదు. ఆయన ఏ ఫలితాన్నిచ్చాడో ఆ ఫలితాన్ని పరతంత్రులమై అనుభవించటమొక్కటే మనం చేయగలిగిన పని. అదికూడా భక్తితో కూడుకున్నది.

దుఃఖం వచ్చిందనుకోండి, నాకు భగవంతుడు దుఃఖమిచ్చాడని బాధ పడకుండా, నేను ఏ జన్మలోనో ఏదో పాపం చేసి వుంటాను, దానికిప్పుడు దుఃఖమిచ్చాడు. ఈశ్వరా! ఇప్పుడు దుఃఖం ఎంత బాధాకరమో తెలుసుకున్నాను కాబట్టి దుఃఖమునకు కారణమైన పాపము నాచేత చేయ బడకుండుగాక. కాబట్టి నాకు దైవమునందు పూనిక కలుగుగాక! అని భగవంతునికి నమస్కరించగలిగిన ప్రజ్ఞ అంకురించటం నిజమైన పరిణతి కలిగిన భక్తిని పొంది వుండటం. అందుకే ధూర్జటి

'నిను సేవింపగ నాపదల్పొడమనీ, నిత్యోత్సవం బబ్బనీ
జనమాత్రుండననీ, మహాత్ముడననీ, సంసారమోహంబు పై
కొననీ, జ్ఞానముగల్గనీ, గ్రహగతుల్ కుందింపనీ, మేలు వ
చ్చినరానీ, యవినాకు భూషణములే శ్రీకాళహస్తీశ్వరా!' (కాళ.శ.-12)

అని అంటాడు. అలా వుండగలిగిన పరిణతి ఈశ్వరుని కృపచేత మాత్రమే సంభవమవుతుంది.

అటువంటి కాలము పరమ బలవత్తరమైన స్వరూపం. అది ఈశ్వర స్వరూపంగా వుండి, ఈ సుఖదుఃఖముల రూపములలో పాపపుణ్యములనుభవించేసి, దానివలన కంటికి కనబడని ఈశ్వరుని ప్రజ్ఞని గుర్తెరిగి ఆయన పాదముల యందు నిరతిశయమైన భక్తిని పెంపొందింప జేసుకుని కృతార్థుడు కాగలిగిన వ్యక్తి ధన్యాత్ముడు.

అందుచేతనే మనకి కాలాన్ని విభాగం చేసారు ఋషులు. అది ఋషుల దార్శనికత. అందుకే మనం పుట్టుకతోనే ఋషికి ఋణపడిపోయాము. ఋషి ఋణం తీరాలంటే ఋషిప్రోక్తమైన వాఙ్మయాన్ని చదువుకోవాలి. కనీసంలో కనీసం నాకు చదువుకోవడం రాదండీ అన్నా, ఇంట్లో శ్రీరామాయణాది గ్రంథములుండాలి. చదవలేకపోయినా కనీసం ఒక్క పువ్వు ఆ పుస్తకం మీద వెయ్యగలగాలి. అవి చదవనినాడు ఋషి ఋణం తీరదు. ఆ ఋషి కాలాన్ని విభాగం చేసాడు. విభాగం చేసి ఏ సమయమందు మనం పరమేశ్వరానుగ్రహం పొందడానికి కాలం మనకు యోగ్యమైన రీతిలో వుంటుందో నిర్ణయం చేసాడు. అందుకే దక్షిణాయనం, ఉత్తరాయనం.

ఎప్పుడైనాసరే నడక అనేది కుంటినడక కాకుండా వుండాలంటే రెండుకాళ్ళ మీద నడవాలి. రెండు కాళ్ళమీద నడిచినట్టే కాలముకూడా ఒక సంవత్సరాన్ని ప్రమాణంగా తీసుకున్నపుడు ఉత్తరాయనం, దక్షిణాయనం అనబడే పేర్లతో రెండు కాళ్ళతో

నడుస్తుంది. ఇందులో దక్షిణాయన పుణ్యకాలం, ఉత్తరాయన పుణ్యకాలం అంటాము. యథార్థంగా పరిశీలన చేస్తే, దక్షిణాయనం తక్కువని, ఉత్తరాయనం ఎక్కువని భావన చేయకూడదు. తెలియక చాలామంది దక్షిణాయనంలో చనిపోతే ఏదో ఉపద్రవం వచ్చేసిందనుకుంటారు. అజ్ఞాని అయినవాడూ, ఎక్కువ భక్తి తత్పరత లేనివాడు ఎప్పుడు పోయినా ఒక్కటే.

శంకరాచార్యులవారు బ్రహ్మసూత్రాల భాష్యం చేస్తూ దక్షిణాయనం అనే మాటకు వుండే అర్థమేమిటో వ్యాఖ్యానం చేసారు. కొన్ని కొన్ని లోకముల మీదుగా జీవుడు ప్రయాణం చేసి బ్రహ్మలోకంలో కొంతకాలం వాసం చేసి మహాప్రళయమందు ఈశ్వరునియందు ఐక్యమైపోయే స్థితి దక్షిణాయనం. అంతేగాని దక్షిణాయనం అంటే ఏదో జీవుడు పాడైపోయే కాలం కాదు. యథార్థమునకు ఉత్తరాయనం కన్నా దక్షిణాయనమే చాలా గొప్పది. ఎందుచేత దక్షిణాయనం చాలా గొప్పది? అంటే దక్షిణాయనం అంతా కూడా మనకి ఉపాసనా సంబంధమై వుంటుంది. మనం పరమేశ్వరుని ఆరాధన చేయటానికి యోగ్యమైన కాలం అంతా కూడా కేవలముగా దక్షిణాయనంలోనే సంభవిస్తుంది. ఉత్తరాయన పుణ్యకాలంలో నిజానికి దక్షిణాయన పుణ్యకాలంలో వచ్చే గొప్ప తిథులు రావు. అందుకే ఉపాసన అంతా దక్షిణాయనం. దక్షిణాయనంలో చనిపోయాడండీ అంటే 'అయ్యో!' అని ఎందుకంటారంటే ఉపాసన చేసుకోగలిగిన కాలం వచ్చినపుడు వుండకుండా శరీరం విడిచిపెట్టేసుకున్నాడ్రా, ఇప్పుడా శరీరం లేకుండా స్నానం చేస్తాడా, దీపం పెడతాడా? చేసుకోలేడు. దక్షిణాయనాన్ని పోగొట్టుకున్నాడని బాధపడతారు తప్ప, దక్షిణాయనంలో చనిపోవడం వల్ల వచ్చే ప్రమాదం ఏదో వుందని భావించకూడదు. కాబట్టి దక్షిణాయనం అంతా ఉపాసనా కాలం. ఉపాసనాకాలం కాబట్టే ఆషాఢమాసంలో వచ్చే గురుపౌర్ణమి, శ్రావణమాసంలో వచ్చే వరలక్ష్మీవ్రతం, ఇలా పరమ ప్రఖ్యాతమైన తిథులన్నీ కూడా దక్షిణాయనంలోనే నడుస్తాయి. ఈ దక్షిణాయనంలో వచ్చే తిథుల ప్రత్యేకత మనకి దేశము కాలము - ఈ రెండింటిచేత పవిత్రమై వుంటుంది. ఒక్కొక్కసారి ఒక్కొక్క ప్రాంతంలో వున్న కారణంచేత మీకు ప్రత్యేకమైన ఫలితమొకటి సమకూడుతుంది.

ఉదాహరణకి నేను గంగానదిలో స్నానం చేసాననుకోండి. గంగానదిలో స్నానం మిగిలిన ఏ నదీస్నానం కన్నా గొప్పదే! స్కాందపురాణంలో అగస్త్యమహర్షితో

మాట్లాడుతూ సుబ్రహ్మణ్యుడంటాడు : మిగిలిన అన్ని క్షేత్రములను ఎందుకు దర్శనము చేయాలి? మిగిలిన అన్ని తీర్థములందు అన్నిరోజులయందు దేనికి స్నానం చెయ్యాలి అంటే – వీటిలో స్నానంచేస్తే, ఇన్ని క్షేత్రాలను దర్శిస్తే, కాశీపట్టణ ప్రవేశానికి, విశ్వనాథుని సేవించటానికి, గంగాస్నానం చెయ్యడానికి అధికారం పొందడం కోసం! అంటే కాశీపట్టణ ప్రవేశం అంత గొప్పది. గంగాస్నానం అంత గొప్పది. తెలిసో తెలియకో కాశీపట్టణ ప్రవేశం చేసాడు. అంతే పూర్వజన్మ పుణ్యం లేకుండా అలా కాశీపట్టణ ప్రవేశం చెయ్యరు. గంగాస్నానం చెయ్యరు. ఆ దేశమునకు ఆ ప్రాంతమునకు ఒక ప్రఖ్యాతి వుంది. అలాగే కాలమునకు కూడా ఒక పవిత్రత వుంటుంది. ఒక్కొక్క కాలమందు మీరు చేసిన పని మీకు విశేషమైన ఆంతర్యం సిద్ధింపజేస్తుంది. మీరు ఎన్నో నెలలు, వారాలు, రోజులు చదివినప్పటికి మీ పరీక్ష మాత్రం గంటో, గంటన్నరో, మూడుగంటలో ఉంటుంది. ఆ సమయంలో మీరు రాసిందానికే ప్రాముఖ్యం. మీ భవిష్యత్తు దానిమీదే ఆధారపడి ఉంటుంది. అట్లాగే కార్తికమాసానికి కూడా ప్రాధాన్యం ఉంటుంది. కాబట్టి ఋషి ఈశ్వరవాక్కును ఆధారం చేసుకుని నిర్ణయం చేసాడు.

దక్షిణాయనం ఉపాసనకాలం. అందునా ప్రత్యేకించి కార్తికమాసం చాలా విశేషమైన నెలగా చెప్పబడుతుంది. కారణం మనకి ఏదైనా చాలా గొప్ప విషయాన్ని నిర్మాణం చేస్తే పైకి కనబడే విషయానికి ఆధార భూతమైనది కంటికి కనబడకుండా ఒకటుంటుంది. పెద్ద సౌధాన్ని నిర్మాణం చేసాననుకోండి నేను, ఆ సౌధాన్నంతటినీ మోస్తున్న పునాది భూమి లోపలుంటుంది. అది కనబడదు. కానీ ఆ పునాదిమీదే సౌధం వుంటుంది. ఒక మహావృక్షమొకటి కనబడిందనుకోండి. అబ్బ శాఖోపశాఖలుగా ఎంత పెద్ద చెట్టండీ అన్నాననుకోండి, నిజానికి ఆ చెట్టును నిలబెడుతున్నటువంటి వేళ్ళు భూమిలోపల వుండి దాన్ని పట్టుకుని వున్నాయి. అలాగే కార్తికమాస వైశిష్ట్యమేమిటో చెప్పడానికి మనకి ఋషి దాన్ని ఆశ్వయుజ మాసంలో వచ్చే చిట్టచివరి తిథి దగ్గరికి వచ్చేటప్పటికే కార్తికమాసం వైభవాన్ని ఆవిష్కరించాడు. ఇది ఒక ప్రక్రియ. ఒక సౌధ నిర్మాణం చేసేటప్పుడు పునాది ముందు వేసినట్టే, ఒక మహత్తరమైన విషయాన్ని చెప్పేటప్పుడు ముందే దాన్ని గురించి ప్రారంభం చేస్తారు. మీకందుకే శ్రీరామాయణంలో సుందరకాండ ప్రారంభం చేసేముందు వాల్మీకి మహర్షి కిష్కింధకాండ పూర్తిచేసి చిట్టచివర ఒక శ్లోకాన్ని వ్రాసాడు. అసలు సుందరకాండ గొప్పతనమంతా అంతో ఇంతో కిష్కింధకాండ చిట్టచివరి శ్లోకంలో చెప్తారు.